MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 271 | పేజీలు : 8 | ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



పేదలకు పట్టాభిషేకం



40 ఏళ్ల నిరీక్షణకు తెర.. 28,445 పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు

త్వరలో పంచగ్రామాల సమస్య పరిష్కారం

సీఎం నారా చంద్రబాబు

విశాఖపట్నం, మహానగర్

దశాబ్దాలుగా ఇళ్ల స్థలాలపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న విశాఖ ప్రాంతంలోని 28,445 పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కన్వేయన్స్ డీడ్లు అందజేశారు. 'పేదలకు పట్టాభిషేకం--మీ ఇల్లు మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా 11 మండలాల్లో 399 ఎకరాల భూమిని ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. మొత్తం 19,33,853 చదరపు గజాల విస్తీర్ణానికి పట్టాలు జారీ చేయగా, వాటి రిజిస్ట్రేషన్ విలువ సుమారు రూ.8,874 కోట్లుగా ఉందని ప్రభుత్వం తెలిపింది. నగరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దశాబ్దాలుగా యాజమాన్య హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాల నిరీక్షణకు పట్టాల పంపిణీతో తెరపడిందన్నారు. భూముల విలువ పెరిగిందని వాటిని విక్రయించవద్దని, భవిష్యత్ భద్రత కోసం వాటిని వినియోగించుకోవాలని సూచించారు. పేదలందరికీ శాశ్వత ఇల్లు, చిరునామా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, గత రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించామని, వచ్చే మార్చి నాటికి మరో 5 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. విశాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పంచగ్రామాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, సుమారు 22 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అర్హులైన పేదలకు దేవాదాయ శాఖ భూముల్లోనూ ఇళ్ల స్థలాలు కల్పిస్తామని చెప్పారు. విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, గ్లోబల్ సిటీగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. - మిగతా2లో



దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీ

- విద్యార్థులు ప్రశ్నించడం ఆ సిస్టమ్‌కు ఇష్టం లేదు
- ఆ ఆరుగురే వ్యవస్థను నడిపిస్తున్నారు
- ఛాత్రోం కీ గూంజ్ ప్రచారంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశమంతా ఒక వ్యవస్థ చేతిలో బందీగా ఉందని ఆరోపణలు
- విద్యార్థులు ప్రశ్నిస్తున్నందుకు ఆ సిస్టమ్ వారిని భయపెడుతోందన్న కాంగ్రెస్ నేత

5



20 ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది

- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డోభాల్
- దేశం అద్భుతమైన భవిష్యత్తు వైపు అడుగులేస్తోందని వెల్లడి
- 2047 వరకు ఉన్న సమయం నిజమైన 'అమృత కాలం' అని వ్యాఖ్య

బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం



- 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు'
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ 5
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా



నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ

- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం!
- దేశాన్ని వీడుతున్న నైరుతి రుతుపవనాలు 5

సోమవారం నుంచే పవన్ కల్యాణ్ పర్యటన



- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్‌కు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ

అమరావతి, మహానగర్

ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. - మిగతా2లో

పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి

- నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలోని 513 మండలాల్లో కరవు
- అధికారుల ప్రాథమిక అంచనా
- వర్షాభావ పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు
- సూక్ష్మ సేద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలిచ్చారు



అమరావతి, మహానగర్

ఏపీలో 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి హై అలర్ట్ ప్రకటించారు. రైతు పంటకు భరోసా, ప్రజలకు నీటి భద్రతే లక్ష్యంగా సీఎం ముందస్తు యాక్షన్ ప్లాన్‌కు దిశానిర్దేశం చేశారు. వర్షాభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించాలని ఆదేశించారు. పంట నష్టం రాకుండా ఇప్పటి నుంచే చర్యలు మొదలు పెట్టాలని, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని తాగునీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం - మిగతా2లో

ఒమేగా అను హాస్పిటల్‌లో.. అత్యాధునిక బృహద్ధమని చికిత్సలు

- వేర్వేరు వయసుల ఇద్దరు రోగులకు ఈవీఏఆర్, టీఈవీఏఆర్ చికిత్సలు
- మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒమేగా అనులో అధునాతన ఏఓర్టిక్ చికిత్స
- మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో సంక్లిష్ట కేసులకు చికిత్స
- తల నుంచి పాదాల వరకు పలు రక్తనాళ సమస్యలకు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్సలు
- ప్రముఖ వాస్కులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మానం భవానీ శంకర్



విజయవాడ రూరల్, మహానగర్

సంక్లిష్టమైన బృహద్ధమని (ఏఓర్టిక్) అన్యూరిజమ్‌లతో బాధపడుతున్న ఇద్దరు రోగులకు ఒమేగా అను హాస్పిటల్‌లో ఆధునిక మినిమల్లీ ఇన్వేసివ్ ఎండోవాస్కులర్ చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు వాస్కులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మానం భవానీ శంకర్ తెలిపారు. ఎనికేపాడులోని ఒమేగా అను హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పేషెంట్లలో ఒకరు యువతి కాగా, మరొకరు వృద్ధుడు. యువతి సాధారణ ఆరోగ్య పరిస్థితిలో ఉండగా, వృద్ధుడు గుండె, మూత్రపిండ సమస్యలతో పాటు ఇటీవల సెప్సిస్‌కు గురై అధిక ప్రమాద పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. మొదటి కేసులో, యువతికి అబ్డామినల్ ఏఓర్టిక్ అన్యూరిజమ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆమెకు ఈవీఏఆర్ (ఎండోవాస్కులర్ అన్యూరిజమ్ రిపేర్) విధానంలో చికిత్స అందించినట్లు చెప్పారు. రక్తనాళం ద్వారా స్టెంట్ గ్రాఫ్ట్‌ను పంపించి అన్యూరిజమ్‌ను రక్తప్రసరణ నుంచి వేరు చేయడం ద్వారా చికిత్స పూర్తి చేశామని, దీంతో సంప్రదాయ ఓపెన్ సర్జరీ అవసరం లేకుండా చికిత్స సాధ్యమైందని వివరించారు. రెండో కేసులో వృద్ధుడికి రప్చర్‌కు చేరువలో ఉన్న థొరాకో-అబ్డామినల్ ఏఓర్టిక్ అన్యూరిజమ్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. ఇది అత్యంత క్లిష్టమైన, అధిక ప్రమాదంతో కూడిన పరిస్థితి అని చెప్పారు. అంతేకాకుండా ఆయనకు ట్రిపుల్ వెసెల్ కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉండటంతో సీఏబీజీ చేయించుకోవాలని వైద్యులు సూచించారని తెలిపారు. మూత్రపిండాల పనితీరు కూడా దెబ్బతిని క్రియాటినిన్ స్థాయిలు పెరగడంతో పాటు, తొలుత సెప్సిస్‌తో హాస్పిటల్‌కు వచ్చినట్లు వివరించారు. ఒమేగా అనులోని మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమగ్రంగా పరిశీలించి, అవసరమైన వైద్య చికిత్సతో ఆయన పరిస్థితిని స్థిరీకరించిన అనంతరం టీఈవీఏఆర్ (థొరాసిక్ ఎండోవాస్కులర్ ఏఓర్టిక్ రిపేర్) విధానంలో బృహద్ధమని సమస్యకు విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. వివిధ వయసులు, విభిన్న ఆరోగ్య పరిస్థితులు కలిగిన ఈ ఇద్దరు రోగులకు విజయవంతంగా చికిత్స అందించడం ద్వారా సంక్లిష్టమైన బృహద్ధమని వ్యాధుల నిర్వహణలో ఆధునిక ఎండోవాస్కులర్ విధానాల ప్రాధాన్యతను చాటిచెప్పామని పేర్కొన్నారు. గతంలో సంక్లిష్టమైన బృహద్ధమని, రక్తనాళాల సమస్యలకు ప్రత్యేక చికిత్సల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. ప్రస్తుతం ఒమేగా అను హాస్పిటల్‌లో అధునాతన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో సంక్లిష్టమైన మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలను నగరంలోని అత్యంత నైపుణ్యంతో, తక్కువ ఖర్చులో అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో సురక్షితంగా చికిత్స అందించే అవకాశం ఉన్న సందర్భాల్లో పెద్ద శస్త్రచికిత్సను నివారించి, ఆధునిక చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ కేవలం సాధారణ రక్తనాళ సమస్యలకు మాత్రమే పరిమితం కాదని డాక్టర్ భవానీ శంకర్ అన్నారు. తల నుంచి పాదాల వరకు అనేక సంక్లిష్ట రక్తనాళ, ఇతర సమస్యలకు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సాంకేతికతలో వచ్చిన పురోగతితో గతంలో ప్రధానంగా శస్త్రచికిత్స ద్వారా చికిత్స చేసిన అనేక సమస్యలను, ఎంపిక చేసిన రోగుల్లో ఎండోవాస్కులర్, ఇమేజ్-గైడెడ్ మినిమల్లీ ఇన్వేసివ్ విధానాల ద్వారా నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. ఫైబ్రాయిడ్లు, థైరాయిడ్ నోడ్యూల్స్, ఆస్టియోఆర్థరైటిస్ కారణంగా వచ్చే మోకాలి నొప్పి, డీప్ వీన్ థ్రాంబోసిస్ (డీవీటీ), స్ట్రోక్ తదితర వాస్కులర్, నాన్-వాస్కులర్ సమస్యలకు కూడా రోగి పరిస్థితిని బట్టి ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. ఈ అధునాతన చికిత్సా విధానాలు నగరంలోని ఒమేగా అను హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగంలో తల నుంచి పాదాల వరకు వివిధ సంక్లిష్ట వాస్కులర్, న్యూరోవాస్కులర్, ఇతర మినిమల్లీ ఇన్వేసివ్ ఇమేజ్-గైడెడ్ చికిత్సలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్లిష్టమైన కేసుల నిర్వహణలో సమన్వయంతో సేవలందించిన కార్డియాలజీ, అనస్థీషియా, నర్సింగ్ బృందాలతో పాటు ఇతర సహాయక విభాగాల సిబ్బందిని డాక్టర్ భవానీ శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, ఒమేగా అను హాస్పిటల్‌లో అధునాతన వాస్కులర్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవల అభివృద్ధికి నిరంతరం మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న చైర్మన్ డాక్టర్ జి. రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ మైండ్ గేమ్ స్టార్ట్

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పిలుపులు, వేస్తున్న పావులు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆయన సాగిస్తున్న సుదీర్ఘ పోరాటంలో.. అనూహ్యంగా అధికార కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ప్రభుత్వం ఎన్ని రకాల వివరణలు ఇచ్చినా, గణాంకాలు ముందుంచినా డీఎస్సీపై తన ఆరోపణలకే కట్టుబడి ఉన్న జగన్.. ఈ క్రమంలో టీడీపీతో సాగుతున్న కూటమి నుంచి బీజేపీ, జనసేన తక్షణమే బయటకు రావాలి అని డిమాండ్ చేయడం వెనుక ఎలాంటి వ్యూహం ఉందనేది ఆసక్తికరంగా మారింది.గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ పెద్దలతో జగన్‌కు ఉన్న సాన్నిహిత్యం బహిరంగ రహస్యమే. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కానీ, ప్రతిపక్షంలోకి వచ్చాక కానీ ఆయన కేంద్ర ప్రభుత్వంపై లేదా ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు చేసిన దాఖలాలు లేవు. అలాంటి జగన్, ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి నుంచి బీజేపీ, జనసేన వైదొలగాలని గొంతు ఎత్తడం వెనుక ప్రధానంగా కూటమి ఐక్యతను దెబ్బతీసే పెద్ద వ్యూహం దాగి ఉందనేది పొలిటికల్ ఎనలిస్ట్‌ల ప్రాథమిక అంచనా. 2024 ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్లే వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు లేదా భవిష్యత్ సమరాల నాటికి ఈ బంధంలో చీలికలు తెస్తే తప్ప, రాజకీయంగా కోలుకోవడం కష్టమనే ఆలోచనతోనే జగన్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారని భావించవచ్చు.డీఎస్సీ వివాదాన్ని కేవలం విద్యాశాఖ , టీడీపీ ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే కాకుండా, మొత్తం కూటమి ప్రభుత్వ నైతిక వైఫల్యంగా చిత్రించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని మండిపడుతున్న ఆయన, ఈ పాపంలో బీజేపీ, జనసేనలు కూడా భాగస్వాములు కాకూడదంటే వెంటనే బయటకు రావాలని నైతిక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి భాగస్వామ్య పక్షాల్లో అంతర్గత అనుమానాలను, విభేదాలను రేకెత్తించడం ద్వారా టీడీపీని ఒంటరిని చేయాలనేది జగన్ వ్యూహంలో భాగం. ఇటీవల కాక్రోచ్ కామెంట్స్, పోరాట వ్యూహాలపై జగన్ మాట్లాడిన తీరును చూస్తే.. ఇది కేవలం కూటమిని విచ్ఛిన్నం చేసే వ్యూహమే కాకుండా, రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీపై కూడా పూర్తిస్థాయిలో వ్యతిరేక గళం విప్పడానికి ఇస్తున్న ముందస్తు సంకేతామా అనే కోణంలోనూ విశ్లేషణలు సాగుతున్నాయి. ఇన్నాళ్లూ కేంద్రంతో మైత్రిని కొనసాగించినా తమకు దక్కిన రాజకీయ ప్రయోజనం ఏమీ లేదని, ప్రతిపక్షంగా నిలదొక్కుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒకేసారి విరుచుకుపడటమే ఏకైక మార్గమని వైఎస్ఆర్‌సీపీ భావిస్తూ ఉండవచ్చు.ఈ విమర్శలు ఫలిస్తాయా అంటే ఆచరణలో అది సాధ్యపడేలా కనిపించడం లేదు. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన, కేంద్రంలోని బీజేపీ నాయకత్వం టీడీపీతో అత్యంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్నాయి. జగన్ చేస్తున్న ఈ డిమాండ్లను కూటమి నేతలు తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, క్యాడర్‌లో ఉత్సాహం నింపడానికి జగన్ ఆడుతున్న మైండ్ గేమ్ ఇది తప్ప, దీనివల్ల కూటమి విచ్ఛిన్నమయ్యే అవకాశం శూన్యమని అధికార పక్షం కౌంటర్ ఇస్తోంది. డీఎస్సీ అక్రమాల నెపంతో కూటమి పునాదులను కదిలించేందుకు జగన్ చేస్తున్న ఈ ప్రయత్నం ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తుందో లేక కేవలం ఒక రాజకీయ ప్రకటనగానే మిగిలిపోతుందో వేచి చూడాలి.



పేదలకు పట్టాభిషేకం



-మొదటిపేజీ తరువాయి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విశాఖ రైల్వే జోన్ కూడా కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో విశాఖలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని, గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు ద్వారా విశాఖకు తీసుకువచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఇప్పటికే గోదావరి నీరు అనకాపల్లికి చేరిందని, దాన్ని వంశధారతో అనుసంధానించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.
రుషికొండలో నిర్మించిన భవనాల వినియోగం, నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విశాఖ ప్రజలకు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, డోలా బాలవీరాంజనేయ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ ఎం.భరత్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి

-మొదటిపేజీ తరువాయి

చేశారు. ఈ మేరకు అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు రాష్ట్రంలో నెలకొన్న కరవు ముప్పుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ వ్యాప్తంగా కరవు ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు రాకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులు, వ్యవసాయ రంగంపై సమగ్ర కార్యాచరణ కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో రైతులకు అందుబాటులో ఉన్న సాంకేతిక సేవలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేలా మైక్రో ఇరిగేషన్‌ను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. అన్నదాతలను సూక్ష్మ సేద్యానికి మరింతగా అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏపీఎంబీపీ కింద కర్షకులకు సంబంధించిన నాలుగు కీలక సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి

సాంకేతిక సేవలు రైతులకు సులభంగా చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. పంటలకు నీటి అవసరం, అందుబాటులో ఉన్న వనరులను బట్టి రైతులకు తగిన సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రకృతి సేద్యం వైపు అన్నదాతలను మళ్లించే కార్యాచరణను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. హై రిస్క్ ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. విశాఖ తాగునీటి సరఫరాపై చంద్రబాబు ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. బోర్లపై ఆధారపడే ప్రాంతాల్లో అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను నింపేందుకు యుద్ధప్రాతిపదికన చేపట్టగల పనులపై అవకాశాలను పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ నుంచి ప్యాకేజీ నంబర్ 8 కింద పైప్?లైన్? ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.
ఖరీఫ్ సీజన్ 2026కు సంబంధించి ఏపీలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం 513 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా, 245 మండలాల్లో మోస్తరుగా ఉన్నట్లు తెలిపారు. కరవు పరిస్థితులపై వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనుంది. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో క్షేత్రస్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలించనున్నాయి. వ్యవసాయశాఖ క్షేత్ర పరిశీలన నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పించనుంది. అనంతరం కరవు ప్రతిపాదనలను కలెక్టర్లు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖకు పంపించనున్నారు. ఈ ప్రతిపాదనలకు సెప్టెంబర్ 24ను తుది గడువుగా నిర్ణయించారు. సెప్టెంబర్ 29న రాష్ట్రస్థాయి కమిటీ కరవు ప్రతిపాదనలను పరిశీలించనుంది.
కరవు మండలాల గుర్తింపు ప్రక్రియపై అధికారులతో జరిగిన సమీక్షలో ఆరు శాఖల నుంచి వచ్చే సమాచారాన్ని సమగ్రంగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, శాటిలైట్ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో వర్షాభావంతో పాటు ఎల్‌నినో ప్రభావం ఉద్యాన పంటలపై ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్?లోని 21 జిల్లాల్లో 1357 ఆర్ఎస్‌కేల పరిధిలోని పంటలను హై రిస్క్ కేటగిరీలో గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఎల్‌నినోతో 17,916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

సోమవారం నుంచే పవన్ కల్యాణ్ పర్యటన

-మొదటిపేజీ తరువాయి

పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు. ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

- ఐలు జిల్లా మహాసభలో చెక్కా బెనర్జీ, సుంకర రాజేంద్రప్రసాద్

గన్నవరం, మహానగర్

ప్రజాస్వామ్య వ్యవస్థను సుస్థిరం చేయడంతో పాటు రాజ్యాంగబద్ధమైన సూత్రాలను పరిరక్షించడంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమని విట్ లా కాలేజ్ డీన్ చెక్కా బెనర్జీ అన్నారు. స్థానిక రాయ్‌నగర్ కన్వెన్షన్ హాలులో శనివారం అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) 13వ జిల్లా మహాసభ ఘనంగా నిర్వహించారు. తొలుత ఐలు జిల్లా అధ్యక్షుడు పి. వెంకట్రావు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వి. కోటేశ్వరరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమానికి చెక్కా బెనర్జీ ప్రధాన వక్తగా, ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చెక్కా బెనర్జీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం సక్రమంగా వర్ధిల్లాలంటే ప్రశ్నించే తత్వం, పారదర్శకత ఎంతో అవసరమన్నారు. నిరంతరం ప్రశ్నించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన న్యాయవ్యవస్థలో నీతి, నిజాయితీలు వర్ధిల్లినప్పుడే పేదలు, బలహీన వర్గాలకు నిజమైన న్యాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, న్యాయం కోసం నిలబడే న్యాయవాదులు నిరంతరం రాజ్యాంగం, చట్టాలను లోతుగా అధ్యయనం చేసి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలంటే ముందుగా న్యాయవాదులు సంపూర్ణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు నిర్వహించే ప్రతి వేదిక పేద, బలహీన వర్గాలకు న్యాయం చేకూర్చేలా, వారి హక్కుల పరిరక్షణకు గళమెత్తేలా ఉండాలని పిలుపునిచ్చారు. నైతిక విలువలతో న్యాయ పరిరక్షకులుగా ముందుకు సాగుతూ పేదలు, శ్రమజీవుల పక్షాన నిలబడి న్యాయ సహాయం అందించడమే న్యాయవాద వృత్తికి అసలైన సార్థకత అని పేర్కొన్నారు. ముఖ్య అతిథి సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం ఆందోళనకరమన్నారు. ప్రశ్నించడాన్ని ప్రోత్సహించిన దేశాలే వేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించి మూఢనమ్మకాలను పెంచడం సరికాదని, శాస్త్రీయ



ఆధారాలతో సాధించిన రాకెట్ ప్రయోగ విజయాలు శాస్త్రవేత్తల కృషి ఫలితమేనని పేర్కొన్నారు. రాజకీయ కారణాలతో నిరపరాధులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేస్తూ, తీవ్ర నేరాలకు పాల్పడిన వారిని వదిలేస్తున్నారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే వారిపై వివిధ ముద్రలు వేయడాన్ని ఆయన ఖండించారు. ప్రజా పోరాటాల ప్రభావంతోనే న్యాయవ్యవస్థలో సానుకూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. న్యాయవాదులు రాజ్యాంగ విలువలను కాపాడుతూ దళితులు, మహిళలు, బాధితుల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. న్యాయవాదుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐలు నిరంతరం పోరాడుతోందని తెలిపారు. మిగిలిన న్యాయవాదులు కూడా సంఘంలో చేరాలని కోరారు. సమాజంలో, వృత్తిపరంగా ఎదురయ్యే అడ్డంకులను అధిగమిస్తూ ప్రజా సమస్యలపై ముందుకు సాగేందుకు మహాసభలు దిశానిర్దేశం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో వికెఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు జి. వెంకట్రావు, ఎం. విజయ్‌కుమార్, ప్రముఖ న్యాయవాదులు శీలం సాంబశివరావు, నండూరి పద్మాంజలి, అనుమోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం ఐలు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా వి. కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వి. రాజారత్నం, ఎస్. రమేష్, సి. సుబ్రహ్మణ్యం, ఏ. సుధాకర్, ఏ. వెంకట్రావు, జె. రామకృష్ణ, ఏ. శ్యామ్, చింతా నాగరాజు, అల్తాఫ్ అహ్మద్, బి. రవి, ఏ. పద్మనాభం, కె.క్రాంతికుమార్, మార్కండేయులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళల టీ-20 క్రికెట్ సందడి షురూ!

నారా బ్రాహ్మణి చేతుల మీదుగా లాంఛనంగా డబ్ల్యూఏపీఎల్ ప్రారంభం





మంగళగిరి

యువ మహిళా క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి, వారికి ఉమెన్ ప్రీమియర్ లీగ్, భారత మహిళా క్రికెట్ జట్టులో అవకాశాలకు మార్గం కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) తొలి సీజన్ శనివారం మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభమైంది. హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాజీ భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్‌తో కలిసి డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించారు. మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు డబ్ల్యూఏపీఎల్ మంచి అవకాశమని బ్రాహ్మణి పేర్కొన్నారు. మిథాలీ రాజ్ డబ్ల్యూఏపీఎల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్, అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు పోటీపడుతున్నాయి. ఏడు రోజుల పాటు 13 మ్యాచ్‌లు జరగనున్నాయి.

తొలి మ్యాచ్‌లో రాయలసీమ జెన్ స్టార్స్ విజయం

మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తొలి మ్యాచ్‌లో రాయలసీమ జెన్ స్టార్స్ ఏడు వికెట్ల తేడాతో గోదావరి గోల్డెన్ ఈగల్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి గోల్డెన్ ఈగల్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. కెప్టెన్ హేన్రిట్టా పెరీరా 49 బంతుల్లో 63 పరుగులు, గుండుపల్లి ఉద్విత 36 బంతుల్లో 30 పరుగులు చేశారు. రాయలసీమ బౌలర్లలో బి. అనూష మూడు, ఈ. పద్మజ రెండు వికెట్లు తీశారు. 117 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ జెన్ స్టార్స్ 17.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి విజయం సాధించింది. సేతు సాయి 23 బంతుల్లో 33 పరుగులు, శుభశ్రీ 23 పరుగులు, ఈ. పద్మజ 18 బంతుల్లో 30 పరుగులు చేశారు. బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసిన పద్మజకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం

పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు

విజయవాడ, మహానగర్



స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసులు శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు సూచనల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ కార్యాలయాలు, ఎస్‌బీ, సీసీఆర్‌బీ, ఏఆర్ కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పోలీస్ స్టేషన్లు, కార్యాలయాలు, పోలీస్ క్వార్టర్స్ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, గుంతల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన జీవనానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. క్వార్టర్స్ పరిసరాల్లో చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తమతో పాటు చుట్టుపక్కల ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

చదరంగంతో మేధస్సు, పోరాటపటిమ



ఆగిరిపల్లి, మహానగర్

విద్యార్థుల్లో మేధస్సు, పట్టుదల, పోరాటపటిమ, వ్యూహాత్మక ఆలోచనను పెంపొందించడంలో చదరంగం కీలక పాత్ర పోషిస్తుందని అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి, చెస్ టోర్నమెంట్ నిర్వాహకురాలు పీడూరు రమ్యకృష్ణ (యూఎస్ఏ) అన్నారు. తోటపల్లిలోని హీల్ స్కూల్‌లో శనివారం ప్రవాస భారతీయుడు స్వర్గీయ మండవ రోహిత్ జ్ఞాపకార్థం చెస్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన బాలబాలికలకు ట్రోఫీలు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రోహిత్ తల్లిదండ్రులు విజయకృష్ణ, అనురాధతో పాటు మండవ వెంకటేశ్వరరావు, అమ్మాజీ, ఐనకూరి వెంకటలక్ష్మి, సాయికృష్ణ ప్రసాద్, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం. కవిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం. హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సుల సాకుతో ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలు విరమించుకోవాలి



గన్నవరం, మహానగర్

విద్యుత్ బస్సుల సాకుతో ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో కార్మికులకు శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... విద్యుత్ బస్సుల పేరుతో ప్రభుత్వ రవాణా సంస్థ అయిన ఆర్టీసీని పినాకిల్ కంపెనీకి అప్పగించే చర్యలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వేల ఎకరాల విలువైన భూములు, డిపోలు, వర్క్‌షాప్‌లను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం వల్ల భవిష్యత్తులో ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం, రాయితీలు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పినాకిల్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసి, ఆర్టీసీయే నేరుగా విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి నడపాలని, మూసివేసిన డిపోలను పునఃప్రారంభించాలని కోరారు. అలాగే సంస్థలో ఖాళీగా ఉన్న 12 వేల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, కొత్తగా 4,000 బస్సులను ప్రవేశపెట్టి గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సర్వీసులను విస్తరించాలని, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతను పరిరక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. పోలినాయుడు, మండల కన్వీనర్ బెజవాడ తాతబ్బాయి, ఆంజనేయులు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుపై రైతులకు అవగాహన

- మ్యాన్‌కైండ్ గ్రూప్ ఆధ్వర్యంలో రైతు సదస్సు



ఆగిరిపల్లి, మహానగర్

అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భంగా మ్యాన్‌కైండ్ గ్రూప్ ఫార్మా లిమిటెడ్ (బీఎస్‌వీ) ఆధ్వర్యంలో గ్రామంలోని బస్‌స్టాండ్ సెంటర్ వద్ద శనివారం సాయంత్రం రైతులకు పాముకాటు నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీజినల్ మేనేజర్ వంగా కోదండ రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్ఐ నాగరాజు, పశువైద్యాధికారి డాక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవాన్ని గ్రామస్తులతో కలిసి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రైతులు, రోజువారీ కూలీ పనులు చేసుకునేవారు పొలాల్లో పనిచేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పాముకాటు వంటి ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ పొలాల్లోకి వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన వెంటనే అందుబాటులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు. రైతు ప్రాణం ఒక కుటుంబ భవిష్యత్తుతో ముడిపడి ఉంటుందని పేర్కొంటూ పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మ్యాన్‌కైండ్ గ్రూప్ ఫార్మా లిమిటెడ్ (బీఎస్‌వీ)కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, బీఎస్‌వీ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని పూజలు

భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు చేసిన మంత్రి పార్థసారథి



ఆగిరిపల్లి, మహానగర్


వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండల పరిధిలోని సగ్గూరు గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలు, రైతాంగం, యువతకు అన్ని విధాలా మేలు జరగాలని గణనాథుడిని కోరుకున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. గణనాథుని కృపాకటాక్షాలతో ప్రజల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి, సుభిక్షతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పాడిపంటలు సకాలంలో పండి రైతులు సంతోషంగా ఉండాలని, నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్. వేణు, స్థానిక నాయకులు కలవకుంట వేణుగోపాలరావు, నాగమణి, సత్యనారాయణ, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బ్రిటన్.. కర్మ రిటర్న్స్!

రవి అస్తమించని సామ్రాజ్యంగా 19వ శతాబ్దంలో ప్రపంచాన్ని శాసించిన యునైటెడ్ కింగ్‌డమ్ ఇప్పుడు నాలుగు ముక్కలు అయ్యే ముప్పును ఎదుర్కొంటోంది. స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడానికి సిద్ధపడుతుండటమే దీనికి కారణం. యునైటెడ్ కింగ్‌డమ్.. యూరోప్‌లోని ఓ ప్రధాన దేశంగా, ఒకప్పుడు భారత దేశాన్ని పాలించిన దేశమని చరిత్ర చెబుతుంది. బ్రిటన్, ఇంగ్లాండ్ పేర్లు కూడా వ్యవహారంలో ఉన్నాయి. ఈ దేశానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అనేక ఆక్రమణలు, సామ్రాజ్యాల విస్తరణ, పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య పరిణామాల సమాహారం ఇది. బ్రిటన్‌లో రాచరిక వ్యవస్థ కొనసాగుతున్నా.. ప్రపంచానికి ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను పరిచయం చేసిన ఘనత బ్రిటన్‌కు ఉంది. బ్రిటన్ పార్లమెంట్‌ను "మదర్ ఆఫ్ పార్లమెంట్స్" అని పిలుస్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి ప్రధానమంత్రిని ఎన్నుకొని పరిపాలన కొనసాగిస్తున్నారు.

చరిత్రలోకి వెళ్లి చూస్తే 80 ఏళ్ల క్రితం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలను ఆక్రమించుకుని.. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పాలించిన ఘనత బ్రిటన్‌కు ఉంది.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అన్ని దేశాలకూ స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఓ చిన్న దేశంగా మిగిలిపోయిన యునైటెడ్ కింగ్‌డమ్‌కు కొత్త ముప్పు పొంచి ఉంది. ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాన్ని నిర్మించిన బ్రిటన్ ప్రభ ఇప్పటికే సమక బారింది. 80 ఏళ్ల క్రితం భారత దేశాన్ని విభజించిన యునైటెడ్ కింగ్‌డమ్ ఇప్పుడు నాలుగు దేశాలుగా ముక్కలయ్యే పరిస్థితి ఏర్పడింది. యునైటెడ్ కింగ్‌డమ్ అంటే బ్రిటన్, స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ భాగాలు కలిసి ఉన్న సంయుక్త దేశం. కానీ ఇప్పుడు ఆ దేశాల ఐక్యతపైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజా స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్లు కార్డిఫ్ వేదికగా సమావేశమై ఇంగ్లాండ్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాలుగా ఏర్పడటానికి అవసరమైన రెఫరెండం, భవిష్యత్ వ్యూహాలపై చర్చించారు. తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే హక్కు ప్రజలకు ఉందని స్పష్టం చేస్తూ ఓ చారిత్రక ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి తాము విడిపోవడానికి రాజ్యాంగ ప్రక్రియను ప్రారంభించాలని ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్‌ను డిమాండు చేశారు. యునైటెడ్ కింగ్టమ్ నుంచి విడిపోయి పూర్తి స్వయం ప్రతిపత్తిగల దేశాలుగా ఉండాలని స్కాట్‌లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ దేశాలు బలంగా కోరుకుంటున్నాయి. స్వాతంత్ర్యాన్ని కోరుకునే ఫస్ట్ మినిస్టర్లు ఒకేసారి అధికారంలో ఉండటం ఇదే తొలిసారి అదే జరిగితే ఆ రాజ్యంలో ఇంగ్లాండ్ ఒకటే మిగులుతుంది. కార్డిఫ్‌లో జరిగిన సమావేశంలో స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్, ఎస్ఎన్‌పీ నేత జాన్ స్విన్నీ, వేల్స్ ఫస్ట్ మినిస్టర్, ప్లాయిడ్ కమ్రి పార్టీ చీఫ్ రూన్ ఆప్ ఇయర్వర్త్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్, సిన్ ఫెయిన్ పార్టీ నేత మిషెల్ పాల్గొన్నారు. వీరు సంతకం చేసిన ఈ అగ్రిమెంటులోని అత్యంత కీలకమైన అంశం స్వయం నిర్ణయాధికారం. వెస్ట్ మినిస్టర్‌గా పిలిచే బ్రిటన్ పార్లమెంట్, ప్రభుత్వానికి కాలం చెల్లిపోయిందనడానికి ఇంతకు మించిన సంకేతం లేదని ఒప్పందంలో పేర్కొన్నారు.. రాజ్యాంగ మార్పునకు సిద్ధంగా ఉండాలని, తమ భవిష్యత్ యూరోప్ యూనియన్‌తో ముడిపడి ఉందని వీరు ఆండీ బర్నహామ్ ప్రభుత్వానికి తెలియజేశారు. తమ సంస్కృతులను కాపాడుకునేలా సొంత నిర్ణయాలు తామే తీసుకోవాలని స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ ప్రజలు భావిస్తున్నారని నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా స్కాట్లాండ్‌లో స్వతంత్ర దేశంగా మారాలనే ఉద్యమం అత్యంత బలంగా ఉంది. ముఖ్యంగా స్కాటిష్ నేషనల్ పార్టీ ఈ డిమాండ్ చేస్తోంది. వాస్తవానికి 2014లో స్వాతంత్ర్యంపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. అప్పుడు 55% మంది జఐలోనే కొనసాగాలని, 45% మంది స్వాతంత్ర్యానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో స్కాట్లాండ్ స్వాతంత్ర్య ప్రయత్నం అప్పట్లో విఫలమైంది. అయితే బ్రెగ్జిట్ తర్వాత పరిస్థితులు మారాయని ఎస్ఎన్‌పీ వాదిస్తోంది. స్కాట్లాండ్ ప్రజలు ఈయూలోనే ఉండాలని అనుకుంటున్నారని, ఈయూ నుంచి బ్రిటన్ బయటకు రావడం వారికి నచ్చలేదని, అలాగే తమ ప్రాంతంలోని చమురు సంపదపై నిర్ణయాధికారం తమకే ఉండాలనుకుంటున్నారని చెబుతున్నారు. స్కాటిష్ నేషనల్ పార్టీ మరోసారి స్వాతంత్ర్యంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. ఇక ఉత్తర ఐర్లాండ్ విషయానికొస్తే.. అక్కడి ప్రజల్లో చాలామంది పక్కనే ఉన్న రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ దేశంతో కలిసిపోవాలని కోరుకుంటున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ పాలన నుంచి వేరుపడి, గతంలో తమకున్న గుర్తింపును తిరిగి పొందాలని కోరుకుంటున్నారు. బ్రెగ్జిట్ కారణంగా వాణిజ్యపరంగా నష్టపోతున్నామని అనుకుంటున్నారు. ఇక తమ చట్టాలను తామే చేసుకోవాలని, తమకంటూ ప్రత్యేకమైన భాష, సంస్కృతిని కాపాడుకోవాలని వేల్స్ ప్రజలు ఆశిస్తున్నారని అంటున్నారు. అయితే ఈ మూడు ప్రాంతాల ఫస్ట్ మినిస్టర్ల డిమాండ్లను ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించలేదు. ఈ హెచ్చరికను ప్రధాని పక్కనబెట్టారని, రాజ్యాంగ చర్చల కంటే జీవన వ్యయాన్ని తగ్గించడానికి సంబంధించిన చర్యలకే ఆయన ప్రాధాన్యమిస్తున్నారని ఆండీ బర్న్‌హామ్ కార్యాలయం స్పష్టం చేసింది. విభజనకు బదులుగా ఉమ్మడి విలువలకు కట్టుబడి, సమస్య పరిష్కారానికి ప్రజలు కలిసి వచ్చినప్పుడే యూకే అత్యుత్తమంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం, విభజన వంటి రాజ్యాంగ అంశాల కంటే ప్రజల రోజువారీ ఆర్థిక సమస్యలకే ఆండీ బర్న్‌హామ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం 3దేశాల మధ్య కుదిరిన ఒప్పందానికి తక్షణ చట్టపరమైన బలం లేదు. దీంతో స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ వెంటనే బ్రిటన్ నుంచి విడిపోయే పరిస్థితి లేదు. అయితే రాజకీయంగా మాత్రం దీని ప్రభావం భారీగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మూడు ప్రాంతాల లక్ష్యాలు, రాజకీయ వ్యూహాలు ఒకేలా లేకపోవడంతో తక్షణమే యునైటెడ్ కింగ్‌డమ్ విచ్ఛిన్నమవుతుందని చెప్పలేం. కానీ బ్రిటన్ రాజకీయాల్లో ఐక్యతపై ప్రశ్నలు మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారుతున్నాయి. ఇప్పటివరకు బ్రిటన్‌ను ఒకే దేశంగా నిలబెట్టిన రాజకీయ వ్యవస్థకు ఈ కూటమి పెద్ద సవాల్‌గా మారనుంది. మొత్తం మీద భవిష్యత్తులో "యునైటెడ్ కింగ్‌డమ్" కలిసి ఉంటుందా? లేక బ్రిటన్‌తో ఒక్కొక్క దేశం బ్రేకప్ చెప్తుందా అనే దానికి కాలమే సమాధానం చెప్పనుంది. కాగా ఇటీవల ఇటీవల రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తాను అవి సంయుక్త ఐర్లాండ్‌ను చూడాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు. అది ఎప్పటికైనా జరగాల్సిందే.. ఇప్పుడే జరిగితే మంచిదంటూ ఎప్పటి నుంచో ఉన్న వివాదాస్పద అంశాన్ని ప్రస్తావించారు. ట్రంప్ వ్యాఖ్యలు చేసిన 48 గంటల్లోనే అవగాహన ఒప్పందంపై మూడు దేశాలు సంతకాలు చేయడం గమనార్హం. 1922లో బ్రిటన్ నుంచి ఐర్లాండ్ స్వాతంత్ర్యం పొందింది. అయితే ఉత్తర ఐర్లాండ్ మాత్రం యూకేలో ఉండిపోయింది. మరొక భాగం రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్ స్వతంత్ర దేశంగా మారింది. టిషర్లు ఒకప్పుడు ఈ భూగోళం మీద ఎక్కువ భాగాన్ని తన నియంత్రణలో ఉంచుకున్నారు. కానీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ ప్రాధాన్యం తగ్గిపోవడం మొదలైంది. ప్రస్తుతం జీడీపీ పరంగా చూస్తే బ్రిటన్ ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. నాలుగు దేశాలుగా విడిపోతే ఇంగ్లాండ్ ఐదు నుంచి ఏడో స్థానానికి పడిపోతుంది. యూకేకి ఉన్న వైశాల్యంలో ఇంగ్లాండ్ 46 శాతాన్ని కోల్పోవాల్సి వస్తుంది. నార్త్ సముద్రంలోని మెజార్టీ చమురు, సహజ వాయువు నిల్వలు, పవన్ విద్యుత్ కేంద్రాలు స్కాట్లాండ్ సరిహద్దులకే పరిమితం అవుతాయి. ఐక్యరాజ్య సమితిలోని యూకే వీటో అధికారం ఎవరికి దక్కాలనే చర్చ కూడా జరుగుతుంది.కాగా యునైటెడ్ కింగ్‌డమ్ విచిన్నమైతే మిలిగే అతి పెద్ద భూభాగం బ్రిటన్. విడిపోతే దాని రాజకీయ, ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. ఆ పరిస్థితుల్లో ఐర్లాండ్ ఏకీకరణ వంటి ప్రశ్నలు జఐ భవిష్యత్తును మరింత ప్రమాదంలో పడేయనున్నాయి.

పెన్షన్ దాతృత్వం కాదు.. ఉద్యోగి హక్కు



కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్ సమావేశాల్లో పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం వేతన సవరణ సంఘాల సిఫారసులను అమలు చేసేటప్పుడు, పెన్షనర్లను వారి రిటైర్మెంట్ తేదీ ఆధారంగా వేర్వేరుగా వర్గీకరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. గతంలో పెన్షనర్లు అందర్నీ ఒకే వర్గంగా పరిగణించాలని, వివక్ష చూపకూడదని సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన కొన్ని తీర్పుల చట్టబద్ధమైన అధికారాన్ని అధిగమించడానికి కేంద్రం ఈ చట్టాన్ని రూపొందించింది. పైగా ఈ చట్టాన్ని 1 జూన్ 1972 నుంచి వెనుకటి తేదీతో వర్తింపజేశారు. దీని ద్వారా గతంలో ఆర్టికల్ 309 కింద చేసిన సీసీఎస్ పెన్షన్ నియమాలు 1972, 2021, 2023 నిబంధనలకు చట్టబద్ధమైన రక్షణ లభిస్తుంది. ఈ చట్టం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల పెన్షనర్లలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. అందుకే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎనిమిదో వేతన సంఘం నిబంధనలో పాత పెన్షనర్ల పెన్షన్ల సవరణ ప్రస్తావనను సరిగ్గా చేర్చలేదని, అందుకు వ్యాలిడేషన్ చట్టమే కారణమని పెన్షనర్లు భయపడుతున్నారు. ఒకే హోదాలో రిటైర్ అయినప్పటికీ ఒక నిర్దిష్ట తేదీ కంటే ముందు రిటైర్ అయిన వారికి భవిష్యత్తులో వచ్చే వేతన సవరణ (పీఆర్సీ), కరువు భత్యం (డీఆర్) ప్రయోజనాలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ నుంచి రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల వరకు పెన్షనర్ల సంఘాలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ చైర్‌పర్సన్‌గా ఉన్న కేంద్ర ఎనిమిదో వేతన సంఘం పరిధిపై, పెన్షనర్ల వేతన సవరణలపై పెన్షన్ రూల్స్ వ్యాలిడేషన్ యాక్ట్ -2025 ప్రభావం చూపనున్నది. గత 5వ, 6వ, 7వ వేతన సంఘాల నిబంధనల్లో పాత పెన్షనర్ల పెన్షన్ల సవరణ, పాత, కొత్త పెన్షనర్ల సామర్థ్యం మధ్య సమానత్వాన్ని కాపాడడం అనే వాఖ్యాలు స్పష్టంగా ఉండేవి. కానీ, 2025 నవంబర్ 3న కేంద్రం నోటిఫై చేసిన 8వ వేతన సంఘం నిబంధనలలో కేవలం 'పెన్షన్, ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాల నిర్మాణాన్ని నియంత్రించే సూత్రాలను పరిశీలించడం' అని మాత్రమే పేర్కొన్నారు. వ్యాలిడేషన్ యాక్ట్-2025 ప్రకారం, ఒక పెన్షనర్ ఏ తేదీన రిటైర్ అయ్యారనే అంశాన్ని బట్టి వారిని వేర్వేరు వర్గాలుగా విభజించే హక్కు ప్రభుత్వానికి లభించింది.

దీనివల్ల, 8వ వేతన సంఘం సిఫార్సులను అమలు చేసేటప్పుడు 1 జనవరి 2026 కంటే ముందు రిటైర్ అయిన వారికి, ఆ తర్వాత రిటైర్ అయ్యే వారికి వేర్వేరు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్లు లేదా సవరణ సూత్రాలను ప్రభుత్వం వర్తింపజేసే ప్రమాదం ఉన్నది. గతంలో ఇలాంటి విభజనను కోర్టులు కొట్టివేసే అవకాశం ఉండేది, కానీ కొత్త చట్టం వల్ల 8వ వేతన సంఘం సిఫారసుల్లో ప్రభుత్వం ఎలాంటి వ్యత్యాసాలు చూపించినా దానికి చట్టబద్ధమైన రక్షణ లభిస్తుంది.

పెన్షన్ అనేది ప్రభుత్వ దాతృత్వం కాదని, అది ఉద్యోగి హక్కు అని భావించే ఉద్యోగ సంఘాలు.. ఈ చట్టం వల్ల సీనియర్ సిటిజన్ల ఆర్థిక భద్రత, సమానత్వ హక్కు దెబ్బతింటుందని దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. రైల్వే ఉద్యోగుల పెన్షన్లు కేంద్ర ప్రభుత్వ 'సంచిత నిధి' నుంచి చెల్లిస్తారు. కనుక ఈ చట్టం వీరికి వర్తిస్తుంది. భవిష్యత్తులో వేతన సంఘాలు వచ్చేటప్పుడు, పాత పెన్షనర్లకు, కొత్త పెన్షనర్లకు వేర్వేరు నిబంధనలు లేదా పెన్షన్ సవరణ ఫార్ములాలు వర్తింపజేసే వీలుంటుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం నుంచి బీఎస్ఎన్ఎల్‌లోకి విలీనమై, సీసీఎస్ రూల్స్ కింద కేంద్ర సంచిత నిధి నుండి పెన్షన్ పొందుతున్న అబ్సార్డ్ ఉద్యోగులపై ఇది ప్రభావం చూపుతుంది. రక్షణ రంగానికి ఇప్పటికే వన్ ర్యాంక్-వన్ పెన్షన్ వంటి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. ఫైనాన్స్ యాక్ట్ 2025 ప్రస్తుత డిఫెన్స్ పెన్షన్ నిర్మాణాన్ని నేరుగా మార్చదు అని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వ్యాలిడేషన్ యాక్ట్ ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ సీసీఎస్ రూల్స్, 1972/2021 కిందకి వచ్చే పెన్షనర్లకు మాత్రమే ఉద్దేశించినది. సాధారణ సివిల్ పెన్షన్ నిబంధనల ఆధారంగా పెన్షన్ పొందే డిఫెన్స్ సివిలియన్లపై ఈ వర్గీకరణ నిబంధనల ప్రభావం ఉండే అవకాశం ఉన్నది.సోషల్ సైన్సెస్ చదవండి

రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత పెన్షన్ రూల్స్ కలిగి ఉంటాయి. కానీ, సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర వేతన సంఘం సిఫారసులను అమలు చేస్తాయి. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రం తరహాలోనే రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షన్ సవరణల్లో మార్పులు చేస్తే అప్పుడు రాష్ట్ర పెన్షనర్లపై ప్రభావం పడుతుంది.

'అందరు పెన్షనర్లు ఒకటే' అని కోర్టుల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వ చట్టం హరిస్తున్నది. ప్రభుత్వం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షనర్లను విభజించవచ్చు. 8వ వేతన సంఘం పరిధిలో పెన్షన్ సవరణలు చేసేటప్పుడు ఈ వ్యాలిడేషన్ పాలసీని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉన్నది. దీనిపై పెన్షనర్ల సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. పార్లమెంట్‌లో ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం.. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ మొత్తానికి ఎలాంటి కోతా పడదు. డియర్‌నెస్ రిలీఫ్ అలవెన్సులు యథావిధిగా కొనసాగుతాయి. ఈ చట్టం సమానత్వ హక్కును దెబ్బతీస్తున్నదని, రాజ్యాంగ విరుద్ధమని పెన్షనర్లు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దీర్ఘకాల ప్రజాసేవకు వాయిదా వేతనమే పెన్షన్ అని పలు తీర్పులలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1983లో పెన్షన్ ప్రభుత్వ ఇష్టానుసారం ఇచ్చే బహుమతి కాదు, ఉద్యోగి సంపాదించిన విలువైన హక్కు అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షనర్లను విభజించడం చెల్లదు. 1971లో పెన్షన్ అనేది ఆస్తి హక్కు. పెన్షన్‌కు ఆర్టికల్ 300ఏ కింద రాజ్యాంగ రక్షణ ఉన్నది. కాబట్టి పెన్షన్ వాయిదా వేతనం, చట్టబద్ధ, రాజ్యాంగ హక్కు, ప్రజా సేవకు గుర్తింపు, సంక్షేమ రాజ్యంలో సామాజిక భద్రతలో ముఖ్య భాగం అని కోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో 8వ పీఆర్సీ నిబంధనలు సవరించి, ప్రస్తుతం ఉన్న పెన్షనర్లందరి పెన్షన్ రివిజన్‌కు చేర్చాలని, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు 01-01-2017 నుంచి పెన్షన్ రివిజన్ మంజూరు చేయాలని, బ్యాంక్, కోల్, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ రంగాల పెన్షనర్లకు పెన్షన్ అప్షన్ కల్పించాలని, స్వయం ప్రతిపత్తి సంస్థల పెన్షనర్లను కేంద్ర వేతన సవరణ, సీజీహెచ్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, ఇంకా పలు డిమాండ్లతో ఈ నెల 17, 18 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు పెద్దఎత్తున జరిగాయి. నేడు కూడా పలు చోట్ల ధర్నాలు జరగనున్నాయి.న్యాయ సలహా పొందండి

దీర్ఘకాల ప్రజాసేవకు వాయిదా వేతనమే పెన్షన్ అని పలు తీర్పులలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1983లో పెన్షన్ ప్రభుత్వ ఇష్టానుసారం ఇచ్చే బహుమతి కాదు, ఉద్యోగి సంపాదించిన విలువైన హక్కు అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షనర్లను విభజించడం చెల్లదు. 1971లో పెన్షన్ అనేది ఆస్తి హక్కు. పెన్షన్‌కు ఆర్టికల్ 300ఏ కింద రాజ్యాంగ రక్షణ ఉన్నది. కాబట్టి పెన్షన్ వాయిదా వేతనం, చట్టబద్ధ, రాజ్యాంగ హక్కు, ప్రజా సేవకు గుర్తింపు, సంక్షేమ రాజ్యంలో సామాజిక భద్రతలో ముఖ్య భాగం అని కోర్టు చెప్పింది.

మణిపూర్‌ను చక్కదిద్దలేరా?



గత మూడేళ్లుగా అనుచిత కారణాలవల్లే ఎప్పుడూ వార్తల్లో ఉంటున్న మణిపూర్ మళ్లీ ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. 2023 మేలో మొదలైన జాతుల ఘర్షణలు ఎప్పుడూ పెద్దగా ఆగిందేమీ లేదుగానీ... మీడియాలో ప్రముఖంగా వచ్చేంత పెద్ద సంఘటనలు జరగలేదు. కానీ ఆ స్వల్పకాల నిశ్శబ్దం కాస్తా గత ఆదివారం బద్దలైంది. ఆ రోజు తమెంగ్లాంగ్ జిల్లాలోని టోలెన్ గ్రామంలో వేకువజామున ఒక మహిళతో సహా నలుగురిదుండగులు కాల్చిచంపారు. అటుతర్వాత సాయంకాలం అదే జిల్లాలో లోంగ్పి అనే గ్రామంలో ఒక యువకుణ్ణి, మహిళను కాల్చిచంపారు.

మొదటి దాడి కుకీ ప్రాబల్య గ్రామంలో నాగాలే లక్ష్యంగా జరిగితే, రెండో దాడి నాగాలు మెజారిటీగావున్నచోట కుకీలపై జరిగింది. 1992--97 మధ్య కుకీ--నాగాల ఘర్షణల్లో బలైనవారి స్మారకార్థం ఆదివారం కుకీలు 'బ్లాక్ డే' పాటించిన రోజునే ఈ రెండు దాడులూ చోటుచేసుకోవడం గమనించదగింది. మణిపూర్ పలు జాతులకు నిలయం. ఇన్ని దశాబ్దాల పాలనలో భిన్న రాజకీయపక్షాల నాయకులు గద్దెనెక్కినా, ఏ ఒక్కరూ ఆ జాతులమధ్య సామరస్య వాతావరణాన్ని నెలకొల్పలేకపోయారు.

2023 నాటి ఘర్షణల సమయంలో అప్పటి బీజేపీ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధాన తెగలైన మెయితీ--కుకీల మధ్య పరస్పర హననం సాగుతుంటే, దాన్ని భద్రతా బలగాలకూ, కుకీ మిలిటెంట్లకూ మధ్య సాగుతున్న ఘర్షణగా చిత్రించే యత్నం చేశారు. చివరకు భద్రతా బలగాలే బీరేన్ సింగ్ ప్రకటనను ఖండించాల్సి వచ్చింది. ఆ ఘర్షణల్లో దాదాపు 300 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ వారిలో చాలా మంది సహాయ శిబిరాల్లోనే బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది.

కొందరు ఇప్పుడిప్పుడే గ్రామాలకు వెళ్తున్న తరుణంలో మళ్లీ హింస చెలరేగింది. మెయితీల ఆధిక్యతగల ఇంఫాల్ లోయలో 2023లో వారివైపు నుంచి హింస మొదలైనప్పుడు అదుపు చేయగలిగి ఉంటే సమీప కొండ ప్రాంతాల్లోని కుకీలు రెచ్చిపోయేవారు కాదు. అయితే మూడేళ్లనాటి హింసకూ, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సాగుతున్న హింసకూ మౌలికంగా వ్యత్యాసం ఉంది. అప్పట్లో వందలమంది గుంపులుగా ఊళ్లపైబడి దాడులు చేశారు. ఇళ్లకు నిప్పంటించటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటంవంటివి చోటు చేసుకున్నాయి.

కానీ ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా వచ్చి దాడులు చేసిపోతున్నారు. అలాగే మొన్నటివరకూ ప్రధానంగా మెయితీ--కుకీ తెగలమధ్యే ఘర్షణలుండగా, మూడు దశాబ్దాల క్రితం నాటి ఉదంతాలను గుర్తు తెస్తూ ఇప్పుడు కుకీ--నాగా జాతులమధ్య వైరం సాగుతోంది. మెయితీలు తమను సైతం గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేయగా, దాన్ని కుకీలు వ్యతిరేకించారు. ఇప్పుడు కుకీలు, నాగాలూ క్రైస్తవులే అయినా వారిమధ్య భూమి విషయంలో కొట్లాటలు సాగుతున్నాయి. బీరేన్ సింగ్ ప్రభుత్వం పోయి, కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగి మొన్న ఫిబ్రవరిలో ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త సర్కారు ఏర్పడింది.

నిండా రెండునెలలు కూడా ప్రశాంతత లేకుండా నాగా--కుకీలమధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఒక మహిళపై అత్యాచారం కూడా చోటుచేసుకుంది. ఇవన్నీ సహాయ శిబిరాల్లో జరిగినవే. ఈ ఉదంతాలపై సమగ్ర నివేదిక కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మరణాలపై లోగడే సర్వోన్నత న్యాయస్థానం త్రిసభ్య సంఘాన్ని నియమించగా, ఆ సంఘం 25 అసహజ మరణాలను ప్రస్తావించింది. వీటిపై జూన్ 11నుంచి వివరణ కోరుతున్నా, ఇంతవరకూ జవాబులేదని ఆ సంఘం చెప్పటంపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. మృతుల వారసులకు అరకొర ఆర్థికసాయం అందించటంపైనా నిలదీసింది. మొత్తంగా 8 జిల్లాల్లోని శిబిరాల్లో 640 మంది మరణించగా, అందులో 34 మంది మరణాలు అసహజమైనవని తేలింది. కానీ 25 మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం జరిపించారు. ఈ వరస చూస్తుంటే పాలకులు మారినా మారిందేమీ లేదని అర్థమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాలు సమగ్రంగా చర్చించుకుని తగిన కార్యాచరణకు దిగనట్టయితే అక్కడ శాంతిభద్రతలు మరింత క్షీణించటం ఖాయం.

దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీ

దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీగా ఉందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడం కూడా ఆ వ్యవస్థకు ఏ మాత్రం ఇష్టం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం రోజు మధ్యప్రదేశ్ ఇందౌర్‌లో నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక) కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, విద్యా వ్యవస్థ, దేశంలోని సంస్థల పనితీరుపైనా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులే దేశ భవిష్యత్తు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల్లేకుండా ఏ దేశమూ గొప్పగా ఎదగలేదని ఆయన అన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడగడం, వ్యవస్థను ప్రశ్నించడం అనేది ప్రజాస్వామ్యానికి అవసరమని, కానీ ఇక్కడ విద్యార్థులు ప్రశ్నలు అడగటం వల్లే వ్యవస్థ వారిని భయపెడుతోందని రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారని ముఖ్యంగా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యుల ఎదుగుదల, దేశంలోని వ్యాపార రంగంలో కొందరి ఆధిపత్యం, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి సంస్థల పనితీరుపైనా ప్రశ్నలు అడుగుతారని రాహుల్ గాంధీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి, అంధభక్తికు ఉన్న వ్యత్యాసం గురించి రాహుల్ స్పష్టంగా వివరించారు. 'విద్యార్థి నిరంతరం ప్రశ్నలు అడుగుతాడు. కొత్త విషయాల్ని తెలుసుకోవాలనే కుతూహలంతో ఉంటాడు. విద్యార్థి కాబట్టే అమిత్ షా కుమారుడు క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎలా అయ్యాడు? ఇద్దరు వ్యక్తులు దేశంలోని వ్యాపారాలన్నింటినీ ఎలా కబ్జా చేశారు? న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం తమ బాధ్యతల్ని ఎందుకు సరిగా నిర్వహించడం లేదు.' అని ప్రశ్నిస్తున్నాడని రాహుల్ అన్నారు.



అదే అంధభక్తి గురించి ప్రస్తావించిన రాహుల్ గాంధీ– 'అంధభక్తుడు ఎలాంటి ప్రశ్నలు అడగడు. మోదీని విష్ణువు అవతారంగా భావిస్తూ తనదైన ఊహా ప్రపంచంలో బతుకుతాడు. అంధ్‌భక్తి పిరికివాడు. మన పాఠశాలలు, కాలేజీల పరిస్థితి ఎందుకు దిగజారింది? మౌలిక సదుపాయాలు ఎందుకు దెబ్బతిన్నాయి? ప్రశ్నాపత్రాలు ఎందుకు లీక్ అవుతున్నాయో అంధ్‌భక్తి ఎప్పటికీ ప్రశ్నించడు.' అని రాహుల్ అన్నారు. అందుకే ప్రశ్నలు అడిగే విద్యార్థుల్ని కాకుండా, అసలేం ప్రశ్నలు వేయకుండా నమ్మే వ్యక్తుల్ని వ్యవస్థ కోరుకుంటోందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సంతోషంగా లేరని, అసౌకర్యంగా, ఒత్తిడిలో ఉన్నారని, వారి భవిష్యత్తుపై వారికి స్పష్టమైన నమ్మకం కూడా కనిపించట్లేదని అన్నారు.

ఆ ఆరుగురే వ్యవస్థను నడిపిస్తున్నారు: రాహుల్ గాంధీ

ఇదే సమయంలో దేశంలోని ప్రస్తుత వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేస్తూ– ఈ వ్యవస్థ వెనుక ఆరుగురు కీలక వ్యక్తులు ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు రాహుల్ గాంధీ. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల పేర్లను ప్రస్తావిస్తూ వీరే వ్యవస్థను నడిపిస్తున్నారని ఆరోపించారు. అజిత్ డోభాల్ సోషల్ మీడియా సహా అనేక వ్యవస్థల్ని నియంత్రిస్తున్నారని, ఫోన్ ట్యాపింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలపై నిఘా పెట్టి సమాచారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా కు చేరవేస్తారని ఆరోపించారు. ఇంకా వివిధ సంస్థల్లో తమకు అనుకూల వ్యక్తులనే వ్యవస్థ నియమించుకుందని మండిపడ్డారు. మోహన్ భాగవత్ సిద్ధాంతపరమైన అంశాల్ని పర్యవేక్షిస్తారని, ఇంకా అంబానీ, అదానీ వ్యవస్థకు ఇరువైపులా ఆర్థిక శక్తులుగా ఉన్నారని అన్నారు.

తన ప్రసంగంలో ఇంకా ఇతర సమస్యలపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇంకా సుమారు లక్ష పాఠశాలలు మూతపడ్డాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. మూతపడ్డ పాఠశాలల్లో 55 శాతం ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలపై విద్యార్థులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఛాత్రోం కీ గూంజ్ ప్రచారం ద్వారా కాంగ్రెస్ విద్యార్థులు, యువత సమస్యల్ని తెలుసుకుంటోంది. ముఖ్యంగా పలు పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలు, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న ఫీజులు, ఉద్యోగ నియామకాల్లో సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై పోరాడుతోంది. ఇప్పటికే కొద్ది నెలలుగా రాహుల్ గాంధీ దేశంలోని పలు నగరాల్లో (కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్‌రాజ్, పుణె) ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు.

నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ

భారతదేశంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. దేశంలో రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. 2026, సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లినట్లు భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది. సాధారణంగా సెప్టెంబర్ 17 నాటికే రాజస్థాన్ నుంచి ఈ నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ ఏడాది 2 రోజులు ఆలస్యంగా తిరోగమనం ప్రారంభమైంది. ఐఎండీ ప్రకారం రాబోయే 3 నుంచి 4 రోజుల్లో రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాలతో పాటుగా పంజాబ్, కచ్, సౌరాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా ఈ రుతుపవనాలు వెనక్కి వెళ్లడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

జూన్ 4న కేరళలోకి ఎంట్రీ– జులై 9న దేశమంతటా విస్తరణ

ఇక ఈ ఏడాది జూన్ 4న కేరళలోకి తొలుత నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. తర్వాత క్రమక్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. జులై 9 నాటికి దేశం మొత్తం రుతుపవనాలు వ్యాపించాయి. ఇప్పుడు సెప్టెంబర్ మూడో వారంలో పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. అయితే ఈ సారి నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. ఐఎండీ డేటా ప్రకారం జూన్ 4 నుంచి సెప్టెంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా చూస్తే వర్షపాతం లోటు 15 శాతంగా ఉంది. వర్షపాతం లోటు అధికంగా ఉన్న ప్రాంతాల్లో దక్షిణ ద్వీపకల్పం ఉంది. దేశంలోనే అత్యధికంగా



ఇక్కడ ఏకంగా 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

ఒక్క జులైలోనే అధిక వర్షపాతం నమోదు

ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అంటే ఈ ఒక్క నెలలోనే సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం (సర్‌ప్లస్) నమోదైందన్నమాట. జులై నెలలో సగటు సాధారణ వర్షపాతం 280.5 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది జులైలో ఏకంగా 283.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంతకుముందు జూన్ నెలలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాస్తవానికి రుతుపవనాలే పలు ప్రాంతాల్లో కాస్త ఆలస్యంగా వచ్చాయంటే, వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురిశాయి. సాధారణంగా జూన్‌లో 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 106.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో జూన్ నెలలో దేశవ్యాప్తంగా చూస్తే 35 శాతం లోటు వర్షపాతం (డెఫిసిట్) నమోదైంది. గత నెల ఆగస్టులో కూడా పరిస్థితులు ఏమంత మెరుగ్గా లేవు. ఆగస్ట్ 31న ఐఎండీ నెలవారీగా విడుదల చేసే డేటా ప్రకారం చూస్తే ఆగస్టులో దేశవ్యాప్తంగా 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఆగస్ట్ నెలలో నమోదైన ఏడో అత్యల్ప వర్షపాతం ఇదే కావడం గమనార్హం.

ఎల్‌నినో ఎఫెక్ట్‌తోనే లోటు వర్షపాతం

ఈ 2026 ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం తగ్గడానికి ప్రధాన కారణాల్లో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం. సదర్న్ ఆసిలేషన్ (జుచీూా) అనే వాతావరణ వ్యవస్థలోని 3 దశల్లో ఈ ఎల్‌నినో ఒకటి. ఇక్కడ పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాటు ఇంకా వాతావరణ మార్పులు కూడా సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల వర్షపాతాలు తగ్గడమే కాకుండా వాతావరణంలో వేడి విపరీతంగా పెరుగుతుంది. సకాలంలో వర్షాలు కురవవు. అదే విధంగా అకాలంగా ఉరుములు, మెరుపులు సహా వడగండ్ల వానలకు దారితీస్తుంది. కొన్ని చోట్ల కురవాల్సిన దాని కంటే తక్కువగా, కొన్ని చోట్ల అకాలంగా కురుస్తుంటాయి. రుతుపవనాలు ముగిసే సమయంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కూడా పడే ప్రమాదం ఉందని గతంలోనే ఐఎండీ హెచ్చరించింది. ఇక ఎల్‌నినోకు వ్యతిరేకంగా ఉండే దశను లా నినా (ఘా చీఱఱు) అని పిలుస్తారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. మధ్యలో న్యూట్రల్ ఫేజ్ కూడా ఉంటుంది.

టీఎంసీ పేరు, గుర్తు వివాదం
ఈసీ నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఇప్పుడు న్యాయస్థానం ముందుకు చేరాయి. పార్టీ పేరు, ఎన్నికల గుర్తుపై ఎన్నికల సంఘం (ఈసీ) తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ నేత మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పార్టీకి చెందిన రెండు వర్గాలు– ఏఐటీసీ పార్టీ పేరు, గుర్తు, సంస్థాగత నియంత్రణపై హక్కు కోరుతున్న నేపథ్యంలో అసలు పేరు, గుర్తును తాత్కాలికంగా నిలిపివేసింది. 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరుతో పాటు పార్టీకి రిజర్వ్ చేసిన 'పూలు, గడ్డి' గుర్తును రెండు వర్గాలు ఉపయోగించకూడదని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పార్టీపై హక్కు విషయంలో తుది నిర్ణయం తీసుకోవడానికి మరింత పరిశీలన అవసరమని స్పష్టం చేసింది. ఈ వివాదంపై మమతా బెనర్జీ వర్గం, ప్రత్యర్థి వర్గం ప్రతినిధుల వాదనలు విన్న అనంతరం ఈసీ ఈ నిర్ణయానికి వచ్చింది. ఎన్నికల గుర్తుల కేటాయింపునకు సంబంధించిన 1968 నాటి నిబంధనల ప్రకారం వివాదాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉందని ఎన్నికల సంఘం పేర్కొంది.

రెండు వర్గాలకు కొత్త పేర్లు, గుర్తులు

అక్టోబర్ 6న జరగనున్న బంగాల్ అసెంబ్లీ ఉపఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు వర్గాలకు ఈసీ తాత్కాలికంగా కొత్త పేర్లు, గుర్తులు కేటాయించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరు, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును కేటాయించింది. మరో వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఎన్వలప్' గుర్తు ఇచ్చింది. ఈ కేటాయింపులు ప్రస్తుతం జరగనున్న ఉపఎన్నికల కోసం మధ్యంతరంగా వర్తిస్తాయని ఈసీ పేర్కొంది.

'పార్టీ గుర్తింపు కోల్పోవడం బాధాకరం'

ఈసీ నిర్ణయంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పార్టీ పేరు, గుర్తును కోల్పోవడాన్ని తల్లి తన బిడ్డను



కోల్పోయిన బాధతో పోల్చారు. ఈ పరిణామాన్ని దేశ ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డేగా అభివర్ణించారు. అయితే ఈసీ ఏర్పాటు చేసిన మధ్యంతర వ్యవస్థను తుది పరిష్కారంగా అంగీకరించబోమని మమత స్పష్టం చేశారు. పార్టీ అసలు పేరు, సంప్రదాయ గుర్తును తిరిగి పొందేందుకు రాజకీయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తానని ప్రకటించారు. మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఎన్నికల సంఘంతో పాటు బంగాల్? అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న రితబ్రత బెనర్జీని ప్రతివాదులుగా చేర్చారు. ఈసీ తీసుకున్న మధ్యంతర నిర్ణయాన్ని రద్దు చేసి, పార్టీ అసలు పేరు, గుర్తుపై తమ హక్కును కొనసాగించేందుకు అనుమతించాలని ఆమె న్యాయపరమైన సవాల్ చేశారు.

ఉపఎన్నికల నేపథ్యంలో కీలక పరిణామం

బంగాల్‌లోని నందిగ్రామ్, రేజీనగర్ అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 6న ఉపఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు అక్టోబర్ 9న జరగనుంది. ఈ నేపథ్యంలో రెండు వర్గాలు ఏ పేరుతో, ఏ గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగుతాయన్న అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఉప ఎన్నికలకు సమయం దగ్గపడుతోన్న వేళ మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి రబియుల్ ఆలం చౌదరి రేజినగర్ ఉప ఎన్నిక బరి నుంచి వైదొలిగారు. తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. మమత వర్గానికి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ శుక్రవారం నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి వైదొలిగారు. ఈ మరుసటిరోజే మరో అభ్యర్థి కూడా వెనక్కి తగ్గడం గమనార్హం.

అసలు వివాదం ఎలా మొదలైంది?

టీఎంసీలో ప్రస్తుత సంక్షోభానికి 2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్టీలో ఏర్పడిన విభేదాలు నేపథ్యంగా నిలిచాయి. క్రమంగా ఈ విభేదాలు శాసనసభా పక్షానికి, ఆ తర్వాత పార్లమెంటరీ విభాగానికీ విస్తరించాయి. పార్టీ అంతర్గత విభేదాల నేపథ్యంలో 58 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీని శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నారని, స్పీకర్ నుంచి గుర్తింపు పొందారని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. దీంతో టీఎంసీ తన 28 ఏళ్ల చరిత్రలో మొదటి పెద్ద విభజనను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. తర్వాత ఈ వివాదం పార్లమెంటుకూ చేరింది. 20 మంది లోక్‌సభ సభ్యులు ప్రత్యేక బ్లాక్‌గా వ్యవహరించేందుకు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం ద్వారా విభేదాలు మరింత స్పష్టమయ్యాయి. ఈ పరిణామాల మధ్య పార్టీ పేరు, గుర్తుపై ఇరు వర్గాల హక్కుల పోరు ఎన్నికల సంఘం ముందుకు వెళ్లింది.

20 ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది

రానున్న 20 ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ధీమా వ్యక్తం చేశారు. దేశం భారీ మార్పులతో అద్భుతమైన భవిష్యత్తు వైపు దూసుకుపోతోందని ఉద్ఘాటించారు. ప్రస్తుతం 4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత జీడీపీ రానున్న రెండు దశాబ్దాల్లో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని డోభాల్ వెల్లడించారు. ప్రధాని మోదీ చెప్పినట్లే 2047 వరకు ఉన్న సమయం నిజంగా 'అమృత కాలం' అని ఆయన అభివర్ణించారు. ఇలాంటి పరివర్తనాత్మక యుగంలో జీవిస్తున్న విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని చెప్పారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రసంగించారు.

"నేటి యువతరం ముందు ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. మీ ముందు తరాల వారు బానిసత్వంలో మగ్గిపోతూ ఎన్నో కష్టాలు పడ్డారు. ఇప్పుడు మీ ముందున్నటువంటి అవకాశాలు వారికి రాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులు మీ కోసం మరింత అనుకూలంగా మారాయి. వృద్ధి సాధించడంలో ఏ దేశానికైనా సాంకేతికత అత్యంత కీలకమైన చోదక శక్తిగా ఉండే దశలోకి మీరు అడుగుపెడుతున్నారు. సమయం మీకు అనుకూలంగా ఉంది. మీలో అపారమైన శక్తి ఉంది. మీ ముందు ఇంకా ఎన్నో దశాబ్దాల భవిష్యత్తు ఉంది. రానున్న ఆరు, ఏడు దశాబ్దాల కాలంలో మీరు ఎన్నో అద్భుతాలను సాధించగలుగుతారు. అంతేకాదు, మీ జీవిత ప్రయాణంలో శ్రీరాముడి వలే ధైర్యంగా ఉండి ముందుకు సాగాలి. ఎందుకంటే, రాముడు చూపించిన ధైర్యసాహసాల కారణంగానే రాక్షస సంహారం కోసం విశ్వామిత్ర మహర్షి ఆయన్ను ఎంచుకున్నారు."

'సొంత విధానాన్ని రూపొందించుకోవాలి'

ఒక నాయకుడిగా ఎదగడానికి సొంత విధానాన్ని రూపొందించుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకమని అజిత్ డోభాల్? పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభ రోజుల్లో సిక్కింలో పనిచేసిన అనుభవాలను ఆయన పంచుకున్నారు. "అప్పట్లో నేను ఐపీఎస్ అధికారిగా ఉన్న సమయంలో సిక్కింలో ఇంటెలిజెన్స్ ఇన్‌ఛార్జ్‌గా నన్ను నియమించారు. ఆ వృత్తికి నేను కొత్త. అంతేకాదు, అప్పుడు సిక్కిం ఇంకా భారత్?లో పూర్తిగా విలీనం కాలేదు. ఆ ప్రక్రియ జరుగుతోంది. ఆ సమయంలో, సరిహద్దు ప్రాంతాలను పర్యవేక్షించడం, పీఎల్ఏ కదలికలు, చైనా సైన్యం కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించడం వంటి బాధ్యతల్లో ఒకటిగా ఉండేవి. ఒకసారి, సరిహద్దు ప్రాంతంలో ఇంటెలిజెన్స్ మిషన్ (గూఢచారి కార్యకలాపం) చేపట్టాం. ఆ సమయంలో సరిహద్దు దాటించి వెళ్లిన ఒక నిఘా బృందం నిర్ణీత సమయంలోగా తిరిగి రాలేకపోయింది. వాళ్లు, అసలు బతికి ఉన్నారో లేదో, వారికి ఏమైందో తెలియకపోవడం వృత్తిపరంగానే కాకుండా మానవీయ కోణంలో కూడా నాకు తీవ్ర ఆందోళన కలిగించింది. అప్పుడు నాకు ప్రధాన కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. 'నువ్వు కొంతమందిని అవతలి వైపుకు పంపావా?' అని పై అధికారి నన్ను ప్రశ్నించారు. నేను, 'నాకు తెలియదు. వారు ఇప్పటికే రావాల్సింది, కానీ రాలేదు' అని చెప్పాను. అప్పుడు ఆయన, 'వారు ఇప్పుడు చైనా అదుపులో ఉన్నారు' అని చెప్పారు. ఆ తర్వాత చైనా వాళ్లు వారిని పట్టుకుని విచారించి చర్చలు లేదా ఒప్పందం తర్వాత తిరిగి పంపించారు. అనంతరం ఆ విషయంపై విచారణ చేపట్టారు. ఆ సమయంలో నా కెరీర్ ముగిసిపోయిందని భావించా. మళ్లీ కొత్త కెరీర్ మొదలుపెట్టాల్సి వస్తుందని అనుకున్నా. కానీ, అందులో నా తప్పేమీ లేదని తేలింది" అని డోభాల్? పేర్కొన్నారు.

బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం

2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.


'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

51 వేల మందికి పైగా నియామక పత్రాలు

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం–కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!



దిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. దిల్లీ శివారులోని ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

ఘనంగా బోయి భీమన్న జయంతి

సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి కందుల దుర్గేష్

భూసురపల్లి వెంకటేశ్వర్లుకు 'బోయి భీమన్న అవార్డు-2026'



విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముఖ్య అతిథులుగా హాజరై బోయి భీమన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుకు 'బోయి భీమన్న అవార్డు-2026'ను మంత్రి ప్రదానం చేసి, జ్ఞాపిక, శాలువాతో పాటు రూ.2 లక్షల నగదు పారితోషికాన్ని అందజేశారు. బోయి భీమన్న రచనలు సమాజంలో చైతన్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందించాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతామన్నారు. తెలంగాణలో ఉన్న బోయి భీమన్న కళాపీఠాన్ని రాజమహేంద్రవరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన కళాకారులందరికీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్వరలో గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు. బోయి భీమన్న సతీమణి హైమావతి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి దుర్గేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ భీమన్న గొప్ప సామాజిక రచయిత అని, ఆయన సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. అవార్డు గ్రహీత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భీమన్న పేరిట అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పూల త్రివిక్రమరావు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, అధికారులు, రచయితలు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పోలీస్ కమిషనర్



విజయవాడ, మహానగర్

నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) పోలీస్ కమిషనర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన తిరుపతి అనూష



విజయవాడ, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల్లో కూటమి సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరంపైనా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంతో పాటు జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తిరుపతి అనూష తెలిపారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్‌కు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

స్వయంగా రోడ్లు ఊడ్చిన మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, మహానగర్

స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సగ్గూరు గ్రామంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం స్వయంగా రోడ్లు ఊడ్చి, మొక్కలు నాటి, ప్రజలతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు, నగరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. పారిశుధ్య కార్మికులు అన్ని ప్రాంతాల్లో సమానంగా సేవలందించాలని, పేదలు నివసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు, మురికివాడల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్లాస్టిక్, ప్యాకేజింగ్ వస్తువుల వినియోగంతో చెత్త పెరుగుతోందని, ప్రజల సహకారంతో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో సరఫరా కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.కోటి కేటాయించినట్లు తెలిపారు. బోర్లు, ట్యాంకర్ల ద్వారా తాగు, సాగు, పశువులకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా జిల్లాకు తాగు, సాగునీరు అందుతోందని, పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. చెత్తను శుద్ధి చేసి రీసైక్లింగ్ ద్వారా



ఎరువు, బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు చెత్త సేకరణ వాహనాలకు ఇంటి చెత్తను అందించి గ్రామాలను సుందర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. సబ్‌కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలు బాధ్యతగా పాల్గొనాలని, పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక యాప్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు కలవకుంట వేణుగోపాలరావు, పుసులూరి నాగమణి, మండల, గ్రామ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

నిబంధనల మేరకే నూతన పింఛన్ల మంజూరు

అర్హతల పరిశీలనలో ఎలాంటి ఉల్లంఘనలకు తావివ్వరాదు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ రూరల్, మహానగర్

జిల్లాలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న పింఛన్లను ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత అర్హతల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి మాత్రమే పింఛన్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. రూరల్ మండలం గొల్లపూడి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు--2 కార్యాలయం నందు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ నూతన పింఛన్లకు సంబంధించిన ఆన్లైన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. దరఖాస్తుల నమోదు, అర్హతల పరిశీలన, సంబంధిత వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను వివరాలు



అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, నూతన పింఛన్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత అర్హతలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారుల అర్హతలను సంబంధిత రికార్డులు, అందుబాటులో ఉన్న సమాచారంతో సరిచూసిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత లేని వ్యక్తులకు పింఛన్లు మంజూరు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పింఛన్ల మంజూరు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి ఉల్లంఘనలకు తావివ్వరాదని స్పష్టం చేశారు. నూతన పింఛన్లకు సంబంధించి సెప్టెంబర్ 21వ తేదీలోగా భౌతిక పరిశీలనను పూర్తి చేయాలని, అలాగే సెప్టెంబర్ 24వ తేదీలోగా తదుపరి ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పింఛన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, అర్హతల ఖచ్చితమైన నిర్ధారణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే భౌతిక పరిశీలనను బాధ్యతాయుతంగా చేపట్టి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి కె ఆర్ ఎస్ ఆర్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, ఆధార్ కోఆర్డినేటర్, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉత్పత్తులకు సోషల్ మీడియాతో విస్తృత మార్కెట్

డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలి

డీఆర్డీఏ సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ సూచన

ఇబ్రహీంపట్నం, మహానగర్

స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ డీఆర్డీఏ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని గుంటుపల్లి రైజ్ కేంద్రంలో 100 మంది డీఆర్డీఏ సిబ్బందికి సోషల్ మీడియా వినియోగం, డిజిటల్ మార్కెటింగ్‌పై శనివారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తయారు చేసే ఆహార ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులు, ఇతర వస్తువులను సోషల్ మీడియా ద్వారా వినియోగదారులకు చేరువ



చేసి వ్యాపార పరిధిని పెంచుకోవచ్చన్నారు. ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, ఫొటోగ్రఫీ, ఉత్పత్తి వివరాల ప్రచారం, వినియోగదారులతో నేరుగా అనుసంధానం వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ పొందిన క్షేత్రస్థాయి సిబ్బంది మహిళా సంఘాలతో కలిసి పనిచేస్తూ ఉత్పత్తులను డిజిటల్ వేదికలపై ఎలా పరిచయం చేయాలి, వినియోగదారులను ఎలా చేరుకోవాలి, వ్యాపారాన్ని ఎలా విస్తరించుకోవాలనే అంశాలపై మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా మహిళలను అప్రమత్తం చేయాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా గ్రామీణ మహిళలు స్థానిక మార్కెట్లకే పరిమితం కాకుండా విస్తృత వినియోగదారుల వర్గానికి తమ ఉత్పత్తులను పరిచయం చేసుకునే అవకాశం ఉంటుందని, తద్వారా వారి ఆదాయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు చిన్నతరహా వ్యాపారాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హెడ్ డా. ఎన్.అపర్ణ రామకృష్ణరావు, ఎం.శ్రావణి, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

యువత, విద్యార్థుల ప్రతిభకు ప్రత్యేక వేదిక.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం, జిల్లా కలెక్టరేట్, రాఘవయ్య పార్క్‌లలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొనడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కళారూపాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సెప్టెంబర్ 24న మధ్యాహ్నం 3 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం వద్ద జరిగే ఎంపిక కార్యక్రమానికి హాజరై తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 27న జరిగే ప్రధాన కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలకు సంబంధించిన చిత్రాలు, కళాఖండాలు, సంప్రదాయ వస్తువులు, పర్యాటక సమాచారాన్ని క్యూఆర్ కోడ్‌లతో కూడిన స్టాళ్ల రూపంలో ప్రదర్శించేందుకు విద్యార్థులు, సంస్థలు పాల్గొనవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా సంప్రదాయ ఆహార సంస్కృతిని ప్రోత్సహించేలా సంప్రదాయ వంటకాల స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా పాల్గొనవచ్చని జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్ తెలిపారు. యువత, విద్యార్థులు, స్థానిక సమాజం భాగస్వామ్యంతో జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించవచ్చని పేర్కొన్నారు.

పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంతో ఆరోగ్యకరమైన సమాజం సాధ్యం

స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

కంచికచర్ల, మహానగర్

పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మున్నలూరు గ్రామంలో శనివారం జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా "హరిత ఆంధ్ర -- శీతల ఆంధ్ర" అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఇంటిలోనే తడి, పొడి చెత్తను వేరు చేయడం అలవాటుగా మార్చుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని తెలిపారు. విస్తృతంగా మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రాన్ని హరిత ఆంధ్ర -- శీతల ఆంధ్రగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం, పరిశుభ్రమైన పరిసరాలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామాల్లో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని కల్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. "స్వచ్ఛ భారత్ -- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామస్తుడు దీనిని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ చెత్త వేయకుండా గ్రామంలో ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం క్రమం తప్పకుండా జరిగేలా సంబంధిత సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు కూడా చెత్త సేకరణ సిబ్బందికి సహకరిస్తూ, తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. చెత్తను రహదారుల పక్కన, కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయడం వల్ల పరిసరాలు కలుషితమై ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ



బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, ఆహ్లాదకరమైన జీవన పరిస్థితులు కల్పించవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణను ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. "స్వచ్ఛ భారత్ -- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని, ప్రతి కుటుంబం తమ ఇంటి నుంచే పరిశుభ్రతకు శ్రీకారం చుట్టాలని జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మున్నలూరు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, గ్రామ పరిసరాల పరిశుభ్రత, కిచెన్ గార్డెన్స్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ విధానం, చెత్త వేర్పాటు, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు, గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి, అవసరమైన చోట్ల తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ వ్యవస్థ నిరంతరం సమర్థవంతంగా కొనసాగేందుకు అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం తమ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలను నాటి సంరక్షించడం వంటి చర్యలను పాటించాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆరోగ్యకరమైన జీవన వాతావరణంతో తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

మున్నలూరు గ్రామ రైతు చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారుచేసి వినియోగించడం ద్వారా పొందుతున్న లాభాలను సభాముఖంగా వివరించారు. తొలుత జిల్లా కలెక్టర్, పర్యావరణాన్ని పరిరక్షించడానికి, తల్లులను గౌరవించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ "ఏక్ పేడ్ మా కే నామ్" ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రామంలో స్వయంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.సీతామహాలక్ష్మి, నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, డివిల్డివో బి.లక్ష్మి కుమారి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, తహసిల్దార్ నరసింహారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో కానీ బాబు, గ్రామ ప్రత్యేక అధికారి అప్పారావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు మున్నలూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన



కైకలూరు, మహానగర్

పర్యావరణ సంరక్షణ గతి విధి, స్వీప్ (సేవ్ వాటర్, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఫ్రమ్ ప్లాస్టిక్) స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని గోపవరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించడం వల్ల భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతాయని విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై తల్లిదండ్రులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించే అలవాటును పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ చైర్మన్ పి. పవన్‌కాంత్, న్యాయవాది చావలి శంకర్ శాస్త్రి, ప్రధానోపాధ్యాయుడు దానం ప్రసాద్, ఉపాధ్యాయుడు దండే బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఎల్ఓసీ అందజేత



విజయవాడ, మహానగర్

ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.69 లక్షల విలువైన ఎల్ఓసీని భవానీపురం ఎన్డీయే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. బ్రాహ్మణ వీధికి చెందిన రంగా భార్గవి (38) గర్భాశయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్ఓసీ మంజూరైంది. కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ సీనియర్ నాయకులు, ముసాఫిర్ ఖానా ప్రెసిడెంట్ సయ్యద్ సలీం, కూటమి నేతలు కలిసి బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేశారు. త్వరితగతిన స్పందించి వైద్య సాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ మైనార్టీ మోర్చా ఇన్‌చార్జ్ దుర్బేసుల హుస్సేన్, టీడీపీ సీనియర్ నాయకులు పాటిబండ్ల బాల, బీసీ నాయకులు ఎస్.పీ. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్షే కంపెనీలో 4 వేలకు పైగా ఉద్యోగాల కోత!

ఇంటర్నెట్ డెస్క్: జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ మరోసారి ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. తన అనుబంధ పోర్షేలో భారీగా లేఆఫ్స్ ప్రకటించనుంది. దాదాపు 4 వేలకు పైగా ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు జర్మనీకి చెందిన ఓ వార్తాపత్రిక వెల్లడించింది. ఆర్థిక పరమైన సమస్యలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పోర్షేలో సుమారు 4,100 మంది ఉద్యోగులను తొలగించాలని ఫోక్స్‌వ్యాగన్ సూపర్‌వైజరీ బోర్డు ప్రతిపాదించినట్లు సమాచారం. దాదాపు 803.8 మిలియన్ డాలర్ల (సుమారు రూ.7,715.81 కోట్లు) ఆర్థిక లోటును అధిగమించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సదరు పత్రిక పేర్కొంది. అయితే, జులై నెలలో కంపెనీ మేనేజ్‌మెంట్ ఇప్పటికే ప్రతిపాదించిన 9 వేల ఉద్యోగాల కోతలకు ఇవి అదనం అని తెలిపింది. చైనాలో కార్ల విక్రయాలు క్షీణించడం, ఎలక్ట్రిక్ వాహనాల వ్యూహంలో మార్పులు రావడంతో పోర్షే కంపెనీ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ తమ వార్షిక లాభాల అంచనాలను కూడా గణనీయంగా తగ్గించుకోవడం గమనార్హం.

ఆ పదవి నుంచి మంత్రిని తొలగించండి: ఆర్బీఐ



ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర మంత్రి బాబాసాహెబ్ పాటిల్‌తోపాటు మరో ఏడుగురిని లాతూర్ డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ల పదవుల నుంచి తొలగించాలని భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. పదేళ్ల పదవీకాల పరిమితిని మించిన నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకుంది. బాబాసాహెబ్ పాటిల్.. ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ నాయకత్వంలోని ఎన్సీపీకి చెందిన నేత. బ్యాంకు సభ్యుడు సతీశ్ జాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ జారీ చేసిన ఆదేశాల మేరకు ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీకాలం గరిష్ఠంగా పదేళ్లు ఉంటుంది. ఈ ఏడాది మేలో సతీశ్ జాదవ్ ఇదే అంశాన్ని లేవనెత్తి.. లాతూర్ డీసీసీ బ్యాంక్‌కు చెందిన ఎనిమిది మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే.. ఆర్బీఐ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో.. జూన్‌లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఆరు వారాల్లోగా దీనిపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆగస్టు 3న ఆదేశించడంతో.. ఆర్బీఐ ఈమేరకు చర్యలు తీసుకుంది.

ఆయుర్వేదంతో ఆరోగ్య ఆంధ్ర నిర్మాణం





ప్రతిఒక్కరూ ఆయుర్వేదం విశిష్టతను గుర్తించాలి

దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్

ఆయుర్వేదం కేవలం ఒక వైద్య విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించే భారతదేశ ప్రాచీన విజ్ఞాన సంపద అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర నిర్మాణానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఆయుష్ శాఖ, డా. ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల, డా. ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, జిల్లా ఆయుష్ విభాగం, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆరోగ్యకర భవితకు ఆయుర్వేదం ఇతివృత్తంతో ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ.. డా. ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపల్ టి.బుల్లయ్య, డా. ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.జగదీష్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వేల సంవత్సరాలుగా ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం ఉందని.. ఆయుర్వేద ప్రాథమిక సూత్రం సమగ్ర ఆరోగ్య సంరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడంతో పాటు, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి, ప్రకృతితో అనుసంధానంగా జీవించడం వంటి అంశాలకు ఆయుర్వేదం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని.. దుష్పరిణామాలు లేని ఆయుర్వేదంలోని ఆరోగ్య సంరక్షణ సూత్రాలు, ఆహార నియమాలు వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజలు.. ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ఆయుర్వేదం వంటి భారతీయ ప్రాచీన వైద్య విజ్ఞాన సంపదకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని.. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, ఆయుర్వేద ఆసుపత్రుల సీనియర్ వైద్యాధికారులు, యూజీ, పీజీ విద్యార్థులు, సిబ్బంది, ఎన్టీఆర్ జిల్లా ఆయుష్ విభాగం వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నాని 'ది ప్యారడైజ్' సినిమాలో 'పొడుస్తున్న పొద్దుమీద'?

నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మాస్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేయగా, తాజాగా మ్యూజికల్ ఫీస్ట్‌కు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతంలో రాబోతున్న పాటల జాబితా నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ గీతంగా కోట్లాది మంది ప్రజల హృదయాలను హత్తుకున్న ప్రసిద్ధ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అమూల్యమైన గీతం 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా...' పాటను ఈ సినిమాలో ఉపయోగిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలతో పాటు ఈ ఐకానిక్ ఫోక్ సాంగ్ కూడా సినిమాలో చోటు చేసుకుంటే, థియేటర్లలో ప్రేక్షకుల ఊపు చూసి థియేటర్లు ఊగిపోవడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. అనిరుధ్ మ్యూజిక్, శ్రీకాంత్ ఓదెల టేకింగ్, నాని మాస్ పెర్ఫార్మెన్స్‌కు తోడు ఈ ఫోక్ సాంగ్ తాలుక వైబ్స్ తోడైతే సిల్వర్ స్క్రీన్ మీద రికార్డులు తిరగరాయడం పక్కా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై చిత్రయూనిట్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇవి కేవలం రుమర్స్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

రా అండ్ రస్టిక్‌గా ఆశిష్ గాంధీ 'డానీ'.. అంచనాలు పెంచుతున్న ఫస్ట్ స్ట్రైక్ గ్లింప్స్!



టాలీవుడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించేందుకు మరో రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోంది. ఆశిష్ గాంధీ హీరోగా, కళ్యాణ్‌జీ గోగణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'డానీ'. రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్లపై రిజ్వాన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'ఫస్ట్ స్ట్రైక్' టీజర్ తాజాగా విడుదల కాగా, సినిమాపై అంచనాలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. టీజర్ ఆరంభంలోనే "నువ్వు బీచ్‌కి ఎప్పుడూ ఒంటరిగా వస్తావా?" అని హీరోయిన్ అడిగే ప్రశ్నకు, హీరో చెప్పే బోల్డ్ ఆన్సర్ యూత్ ఆడియెన్స్‌ను ఇన్‌స్టంట్‌గా కనెక్ట్ చేసేలా ఉంది. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో కేవలం రొమాన్స్ మాత్రమే కాకుండా, థ్రిల్ గొలిపే యాక్షన్ సన్నివేశాలకు కూడా పెద్ద పీట వేసినట్లు స్పష్టమవుతోంది. బీచ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్, నటీనటుల గ్లామర్ అప్పీల్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇప్పటికే దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ, హీరో ఆశిష్ గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన 'నాటకం', 'కళింగ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించాయి. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టడానికి 'డానీ'తో వస్తుండటంతో సినీ వర్గాల్లోనూ మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టెక్నికల్ పరంగా కూడా 'డానీ' ఫస్ట్ స్ట్రైక్ అత్యున్నత ప్రమాణాలతో నిలిచింది. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, కలర్ ఫుల్‌గా ఉంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా బీజీఎం అదరగొట్టింది. ఖుషి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి మణికాంత్ ఎడిటర్‌గా, రామ్ సుంకర, కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రాఫర్లుగా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను మేకర్స్ విడుదల చేయనున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి అక్టోబర్ నెలలో ఈ సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. రా అండ్ రస్టిక్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ 'డానీ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!



విశ్వక్ 'కల్ట్' రిలీజ్ డేట్ ఫిక్స్

నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం చ'కల్ట్'. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, కార్తికేయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సందీప్ కాకరాల మరో నిర్మాత. చ'కల్ట్' సినిమాను అక్టోబరు 30న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. "ఈ చిత్రంలో విశ్వక్ సేన్ పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉంటాయి. ఇంటర్నేషనల్ అప్పీల్‌తో కూడిన కథ ఉన్న ఈ సినిమాను తెలుగు, హిందీ, ఇంగ్లిష్, జపనీస్, స్పానిష్ భాషల్లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం" అని యూనిట్ పేర్కొంది.

హాలీవుడ్‌లో నటించాలనుంది.. ఆ సినిమాలో నాకు ఛాన్సివ్వండి - విజయ్ సేతుపతి



టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి తన కెరీర్ మరియు రాబోయే ప్రాజెక్ట్‌ల గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఇటీవల నిథిలన్ స్వామినాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని ఆయన వెల్లడించారు. నిథిలన్ ఒక అద్భుతమైన దర్శకుడని ప్రశంసించిన విజయ్ సేతుపతి, మొదటి భాగం 'మహారాజా' విడుదల కాకముందు కొందరు ఈ సినిమాపై నమ్మకం ఉంచలేదని, కానీ తాను మాత్రం సినిమా విజయం సాధిస్తుందని గట్టిగా నమ్మానని గుర్తుచేసుకున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా హాలీవుడ్ నుంచి ఓ భారీ ఆఫర్ రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్మాత తనకు ఫోన్ చేసి 'మహారాజా' సినిమాను హాలీవుడ్‌కు అమ్మేశామని చెప్పారని, ఆ చిత్రంలో హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కానగీ నటించబోతున్నారని తెలిపారన్నారు. ఈ విషయం విన్న వెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని, నిర్మాతతో మాట్లాడుతూ 'ఒక సినిమాలో నేను ఉచితంగా నటిస్తాను.. కానీ ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు కూడా ఒక చిన్న పాత్ర ఇప్పించండి.. నేను అక్కడికి వెళ్లి నటిస్తాను' అని సరదాగా అన్నట్లు విజయ్ సేతుపతి తెలిపారు. తనకు మొదటి నుంచీ హాలీవుడ్‌లో నటించాలనే బలమైన కోరిక ఉందని, తన సినిమా అక్కడకు చేరుకోవడం తనకు ఎంతో ఆనందాన్నిస్తోందని ఆయన మనసులోని మాటలను బయటపెట్టారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999